క్లుప్తంగా

రేపటి నుంచి కొత్తపేట గంగమ్మ జాతర



విద్యుత్ అలంకరణలో గంగమ్మతల్లి ఆలయం

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లి జాతర శని, ఆదివారాల్లో ఘనంగా జరుగనుంది. శనివారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి అమ్మవారికి పూజలు నిర్వహించనున్నారు. శనివారం బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. మొదటి బహుమతిగా రూ.80 వేలు, రెండు రూ.60 వేలు, మూడు రూ.40 వేలు, నాలుగు రూ.30 వేలు ఐదవ రూ.20 వేలు, ఆరు రూ.10వేలు అలాగే పోటీలో పాల్గొన్న ప్రతి కాడికి ప్రోత్సాహక బహుమతిగా రూ.5 అందించనున్నారు. భక్తులకు భోజనం ఉంటుందన్నారు. శనివారం రాత్రి 8 గంటలకు ఆర్కెస్ట్రా ఉంటుందన్నారు. ఆదివారం తెల్లవారుజామున గంగమ్మ అమ్మవారి కల్యాణ ఉంటుందన్నారు.

శివనామస్మరణతో నగర సంకీర్తన



పంచామృతాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

వేంపల్లె : మహా శివరాత్రి పండుగ సందర్భంగా వేంపల్లెలో వెలసిన శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి దేవాలయం(మఠం)లో బుధరాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో పంచామృతాభిషేకం నిర్వహించామని ఆలయ అర్చకులు దుర్వాక వెంకటనరసయ్య తెలిపారు. అనంతరం వేంపల్లె పురవీధుల్లో భక్తులు శివనామస్మరణతో నగర సంకీర్తన చేశామన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చండి

పులివెందుల టౌన్ : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కౌన్సిలర్ ఖాదర్‌బాషా, జహీర్ అహ్మద్‌లు గురువారం స్థానిక మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు బీజేపీకి మూడు సీట్లు వస్తే ప్రతిపక్ష హోదా ఇవ్వలేదా అన్నారు. టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి మీ ఊరిలో నువ్వు వార్డు కౌన్సిలర్‌గా కూడా గెలవలేదు నీకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే నైతిక విలువలు లేవన్నారు. మీరు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను ఎక్కడ ఎండగడతాడోనని భయపడి ప్రతిపక్షానికి నోరునొక్కేస్తున్నారన్నారు. కూటమి నాయకులను ఎక్కడికక్కడ ప్రజలు చొక్కా పట్టుకుని నిలదీసే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

నేడు ముంపు సమస్యలపై చలో కలెక్టరేట్

కొండాపురం : గండికోట ప్రాజెక్టులో ముంపునకు గురైన 22 గ్రామాల సమస్యల పరిష్కారానికి నేడు శుక్రవారం చలో కలెక్టరేట్‌లో ధర్నా చేపడుతున్నట్లు గురువారం సీపీఐ మండల కార్యదర్శి ఎం. మనోహర్‌బాబు తెలిపారు.

పీహెచ్‌సీ తనిఖీ



తొండూరు పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న టీబీ ముక్తి పంచాయత్ టీం సభ్యులు

తొండూరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం టీబీ ముక్తి పంచాయత్ టీం సభ్యులు డాక్టర్ మహమ్మద్ తహ, డాక్టర్ శ్రావణ్ కుమార్‌లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు పీహెచ్‌సీలోని క్షయ వ్యాధి కేసుల సంఖ్య, చికిత్స పొందుతున్న వారి సంఖ్య, చికిత్స మధ్యలో ఆపివేసిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మందులు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. 2030 వాటికి భారతదేశం నుండి క్షయ వ్యాధిని తరిమి వేయాలని, భారత దేశాన్ని టి.బి. ముక్త భారత్‌గా తీర్చిదిద్దాలన్నారు. క్షయ వ్యాధి లేకుండా చేయాలని, కావున క్షయ వ్యాధిని గుర్తించిన ప్రతి రోగికి మందులు, పోషకాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ ఆరిఫుల్లా, డాక్టర్ రేష్మా, ఫార్మసిస్ట్ ఓబులేసు, సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

2న ఉచిత వైద్య శిబిరం

కమలాపురం : స్థానిక స్వామి వివేకానంద స్కూల్‌లో మార్చి 2వ తేదీ ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్కూల్ కరస్పాండెంట్ రామ సుబ్బారెడ్డి, మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు జుటూరు విజయ్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక ఆ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరానికి సంబంధించిన పోస్టర్లను వారు విడుదల చేసి మాట్లాడారు. కడప నగరంలోని ప్రైమ్ హాస్పిటల్ మల్టీ అండ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డాక్టర్ మహేష్ బృంగి సహకారంతో నిర్వహిస్తున్నారు.

నన్నారి.. ఉపాధికి దారి..!

- రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఊపందుకున్న నన్నారి విక్రయాలు
- తయారీదారులకు మూడు నెలలపాటు ఉపాధి



వేంపల్లె పట్టణంలోని నన్నారి షరబత్‌ను విక్రయిస్తున్న వ్యాపారి

వేంపల్లె : నన్నారి షర్బత్ అంటే పశ్చిమ రాయలసీమ ప్రాంతాల్లో తెలియని వారు ఉండరు. దీన్ని కొన్ని ప్రాంతాల్లో సుగందపాలుగా కూడా పిలుస్తుంటారు. సాధారణ రోజుల్లోనే చాలామంది ఈ పానీయాన్ని అతి ప్రియంగా తాగుతుంటారు. అలాంటిది వేసవికాలంలో అయితే ఈ పానీయానికి ఉండే డిమాండే వేరు. ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నన్నారి అమ్మకాలతో దుకాణాలు కిక్కిరిసి ఉంటాయి. దీంతో ఈ నన్నారి షర్బత్ తయారు చేసే కుటుంబాలకు చేతినిండా పని ఉంటుంది. వేసవి కాలం మొదలు కావడంతో నన్నారి తయారీని మండల కేంద్రంలో చాలామంది చేపడుతున్నారు. వేసవికాలం వచ్చిందంటే చాలు నన్నారి షరబత్ తయారీకి వినియోగించే సుగంధ వేర్లకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. నిత్యపూజ కోన, పొలతల, గంగమ్మ జాతర వంటి తిరునాళ్లు రావడంతో పుణ్యక్షేత్రాలకు తరలి వచ్చే వేలాది మంది ప్రయాణీకులకు మండల కేంద్రం రద్దీగా ఉంటుంది. దీనికితోడు నన్నారికి వ్యాపారానికి డిమాండ్ ఉంటుంది.

నన్నారి తయారీ చాలా సులభం

కిలో నన్నారి వేర్లను ఉడికించడం ద్వారా 25 లీటర్ల నన్నారిని తయారు చేయవచ్చు. లీటరు నన్నారి రూ.150ల నుంచి రూ.200ల వరకు మార్కెట్‌లో డిమాండ్ ఉంది. లీటరు నన్నారికి సోడాతోపాటు కొద్దిగా నిమ్మరసం కలపటం ద్వారా 20 గ్లాసుల నన్నారి షరబత్ తయారవుతుంది. ఎక్కువగా గిరిజనుల నుంచి నన్నారి వేర్లను కొనుగోలు చేసి సమపాకంలో ఉడికించి నన్నారి షరబత్‌ను సులభంగా తయారు చేసుకోవచ్చు.

నన్నారి షర్బత్‌తో ఎన్నో ప్రయోజనాలు

వేసవికాలంలో నోరూరించే రుచి, సువాసనలతో ఉండే నన్నారి షరబత్ ఎంతో దాహార్తిని తీరుస్తుంది. అంతేకాకుండా శరీరంలో అధిక ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది. మూత్ర సంబంధిత సమస్యలకు మందుగా పని చేస్తుంది. వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుంది. హార్మోన్ల సమతుల్యతను పెంపొందిస్తుంది. జీర్ణక్రియ సమతుల్యంగా సాగేలా పనిచేస్తుంది. శరీర బరువును నియంత్రణలో ఉండేలా ఉపకరిస్తుంది.

రోజుకు రూ.5వేలు వ్యాపారం జరుగుతుంది



ఎండాకాలం మొదలవుగానే షరబత్ వేర్లను తెచ్చుకుని వాటిని సమపాళ్లలో ఉడికించి నన్నారిని తయారు చేసుకుంటాం. ప్రధాన రహదారుల్లో తిరగగా రోజుకు రూ.5వేల వ్యాపారం జరుగుతుంది. ఖర్చులు పోను రూ.800ల నుంచి రూ.1000వరకు మిగులుతుంది. ఈ మూడు నెలలపాటు మాకు ఎంతో జీవనోపాధిని కల్పిస్తుంది. – షేక్ ఖాజా మొహిద్దిన్, నన్నారి షరబత్ వ్యాపారి, వేంపల్లె

రేపు ఉచిత గుండె, కంటి వైద్య శిబిరం

పులివెందుల టౌన్ : పట్టణంలోని జెండామానువీధిలో ఉన్న ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం మహమ్మద్ షబ్బీర్ ముబారక్ సప్లయర్స్ ఆధ్వర్యంలో ఉచిత గుండె, కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో గుండె సంబంధిత వ్యాధులతో కంటి సంబంధిత వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి జీఆర్‌బీఎస్, బీపీ, ఇసీజీ, 2డీ ఎకో చేస్తామన్నారు. ఈ శిబిరానికి వచ్చేవారు మాస్క్ ధరించి రావాలన్నారు.

నేడు నీటి సరఫరా నిలిపివేత

పులివెందుల టౌన్ : పట్టణంలోని భాకరాపురం, నగరిగుట్ట, మంగళకాలనీ, ఎస్సీ కాలనీ, క్రిష్టియన్ లైన్, సియోన్‌పురం, అహోబిలాపురం, శ్రీనివాస థియేటర్ ప్రాంతాలలో శుక్రవారం నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. గురువారం ఆయన తెలుపుతూ నక్కలపల్లె సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద మరమ్మతుల పనుల నేపథ్యంలో నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు సహకరించాలన్నారు.

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయాలి



విద్యార్థి నమూనాను పరిశీలిస్తున్న ఆర్జీయూకేటీ వీసీ, తదితరులు

వేంపల్లె : వివిధ రకాల ప్రయోగాల ద్వారా విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని ఆర్జీయూకేటీ వీసీ విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆర్జీయూకేటీ పరిధిలోని ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో అభియంత్ టెక్నికల్ ఎక్స్‌పో-2025ను ఆయన అట్టహాసంగా ప్రారంభించారు. విద్యార్థులు చేపట్టిన పలు రకాల టెక్నికల్ ఎక్స్ బిట్‌లను సాక్ భవనంలో ఏర్పాటు చేశారు. ప్రయోగ ప్రదర్శనలను వైస్ ఛాన్సలర్ సందర్శించారు. అనంతరం వాటి ఉపయోగాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం వలన విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను బయట పడుతుందన్నారు. భవిష్యత్‌లో కొత్త, కొత్త అవిష్కరణలకు బీజం పడుతుందన్నారు. మూడు రోజుల పాటు అభియంత్ టెక్నికల్ నిర్వహించడం సంతోషకరమన్నారు. అనంతరం అభియంత్ టెక్నికల్ ఎక్స్‌పో సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ పెనుగొండ రవికుమార్, డీన్ అకడమిక్స్ రమేష్ కైలాస్, అనిల్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్‌పై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలి



మాట్లాడుతున్న జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాల బయన్న

వేంపల్లె : సైన్స్‌పై ప్రతి విద్యార్థి మక్కువ పెంచుకుని ప్రయోగాలు చేపట్టాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బాలబయన్న తెలిపారు. గురువారం స్థానిక శ్రీనివాస పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ ముందస్తు వేడుకల్లో భాగంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'సమాజ అభివృద్ధిలో సైన్స్ పాత్ర' అనే అంశంపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. సామాజిక అభివృద్ధిలో శాస్త్రవేత్తల పాత్ర చాలా గొప్పది అన్నారు. కంప్యూటర్ యుగంలో మూఢ నమ్మకాలను నమ్మరాదన్నారు. అనంతరం మూఢ నమ్మకాలతో ప్రజలను ఎలా మోసం చేస్తున్నారనే విషయాలపై మ్యాజిక్ ప్రక్రియలను విద్యార్థులచేత చేయించారు. అలాగే ఐస్ గడ్డమీద పాలకుండ పెట్టి పాలను పొంగించారు. అలాగే సలసలా కాగే నూనెలో నుంచి కాలే బజ్జీలను ఖాళీ చేతితోనే బయటికి తీశారు. ఈ ప్రక్రియలో వాటి వెనక ఉన్నది అంతా సైన్స్ అని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ నాయకురాలు ఆరుణ, పాఠశాల కరస్పాండెంట్ కేశవ, జేవీవీ మండల నాయకులు పాల్గొన్నారు.

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు అమలు చేయాలి



ఆర్జీయూకేటీ వీసీ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ కమిటీ సభ్యులు

వేంపల్లె : ఆర్జియూకేటీ పరిధిలోని ట్రిపుల్‌ఐటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచింగ్ గెస్ట్ ఫ్యాకల్టీల సమస్యల పరిష్కారానికి సంబంధించి ఏపీ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ కమిటీ సభ్యులు ఆర్జీయూకేటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్‌ను కోరారు. ఈ మేరకు గురువారం ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీకి విచ్చేసిన ఆయనను గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్‌హుస్సేన్‌తో పాటు కమిటీ సభ్యులు కలసి వినతిపత్రం అందజేశారు. హైకోర్టు తీర్పు ఇచ్చి రెండేళ్లు గడుస్తున్నా.. ఇప్పటికీ నిమ్మకు నీరెత్తినట్లు అధికార పక్షం వ్యవహరిస్తుందని తెలిపారు. తమకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలన్నారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం మినిమం టైం స్కేల్ లేదా 2022 ఏడాదిలో ఇచ్చిన జిఓ 110ను ఇంప్లిమెంట్ చేయాలని వినతిపత్రంలో తెలిపారు. ఇందుకు వైస్ ఛాన్సలర్ స్పందించి ప్రిన్సిపాల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లి గవర్నర్ కౌన్సిల్‌లో ప్రవేశపెడతామని తెలిపారు. సాధ్యమైనంత త్వరలో సమస్యకు పరిష్కారాన్ని వెతుకుతామని హామీ ఇవ్వడం జరిగింది.

వైభవంగా స్వామివారి ప్రాకారోత్సవం



భానుకోట క్షేత్రంలో స్వామివారి ప్రాకారోత్సవం

సింహాద్రిపురం : మండలంలోని అహోబిలం గ్రామ సమీపంలో ఉన్న భానుకోట శ్రీసోమేశ్వరస్వామి క్షేత్రంలో బుధవారం రాత్రి స్వామి ప్రాకారోత్సవం వైభవంగా నిర్వహించారు. మహా శివరాత్రి పండుగ పురస్కరించుకుని పలు అభిషేకాలు తోపాటు లింగోద్భవ కాలాభిషేకంతోపాటు కల్యాణోత్సవంను అర్చకులు సురేష్ శర్మ, భద్రి శర్మలు నిర్వహించారు. భక్తుల జాగారణ కోసం నిర్వహించిన శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాటక ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. గురిజాల గ్రామంలోని అప్పస్వామి ఆలయంలో బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారు జాము వరకు భక్తిశ్రద్ధల మధ్య భజనలు చేస్తూ గ్రామోత్సవం నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణలో గంగమ్మ దేవత



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ దేవత

లింగాల : మండలంలోని పెద్దకుడాల, చిన్నకుడాల గ్రామాల్లో వెలసిన శ్రీగంగమ్మ దేవత ఆలయాలలో శివరాత్రి రోజు అర్ధరాత్రి అమ్మవారికి కంకణ ధారణ గావించారు. ఆలయ కమిటీ చైర్మన్లు జయచంద్రారెడ్డి గంగమ్మ అభరణాలను పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. దీంతో మార్చి 9న జరిగే గంగమ్మ తిరుణాలకు శ్రీకారం చుట్టారు. ఆయా గ్రామాల్లో వందలాది మంది భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గేట్ వసూళ్ల కట్టడికి వినతి



కమిషనర్ శేషఫణికి వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలోని దినసరి మార్కెట్ గేటు వసూళ్లను ఇష్టరాజ్యంగా వసూళ్లు చేస్తున్నారని దాన్ని నియంత్రణ చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కమిషనర్ శేషఫణిని కలసి సీపీఐ నాయకులు వినతిపత్రం అందించారు. మార్కెట్ గేటుకు సంబంధించిన సవాల్ పడిన వ్యక్తి అధికారులు నిర్ణయించిన ధరనే వసూళ్లు చేయాలన్నారు. రేట్లు అధికంగా వసూళ్లు చేయకూడదన్నారు. ఒక్క రోజు గేటు కట్టకపోతే బెదిరిస్తున్నారని కొందరు వ్యాపారస్తులు వాపోతున్నారు.

ప్రొద్దుటూరు కంటే ఎర్రగుంట్లలో గేటు అధికంగా ఉన్నాయన్నారు. స్పందించిన కమిషనర్ చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు

పెండ్లిమర్రి : పొలతల శైవ క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమై గురువారంతో ముగిశాయి. ఉత్సవాలకు జిల్లా నలుమూల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు తరలివచ్చి మల్లేశ్వరస్వామి, పార్వతిదేవి, అక్కదేవతలు, పులిబండెన్న స్వాముల వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా జిల్లా ఎస్పీ ఆశోక్‌కుమార్ పర్యవేక్షణలో పోలీసులు, ఆలయ ఈఓ కృష్ణానాయక్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. బుధవారం రాత్రి స్వామివారి రథోత్సవం మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి అక్కదేవతల గుడి వరకు వైభవంగా నిర్వహించారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణ మహోత్సవంలో ఉత్సవ మూర్తులు

వీరపునాయునిపల్లె : మహాశివరాత్రి పురస్కరించుకుని సంగమేశ్వరాలయంలో గురువారం ఉదయం 3 గంటలకు శివ, పార్వతుల కల్యాణం అర్చకుడు సుబ్రమణ్య శర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు. షిర్డి సాయి ఎలక్ట్రికల్స్ ఎండీ విశేశ్వర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి దంపతులు కల్యాణ మహోత్సవంలో కూర్చుని ఉత్సవాన్ని జరిపించారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. మాజీ చైర్మన్ మురళీమోహన్‌రెడ్డి, ఈఓ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్సవాలకు ఆర్థిక సాయం అందచేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు దిన్నెపాటి గంగమ్మతల్లి తిరుణాల

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని కదిరి రోడ్డు వెంకటాపురం గ్రామ సమీపంలో వెలసిన దిన్నెపాటి గంగమ్మతల్లి ఆలయంలో శనివారం తిరుణాల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అమ్మవారికి అన్నదానం, అమ్మవారికి గ్రామోత్సవం ఉంటుందన్నారు. అలాగే ఒంగోలు గిత్తల సీనియర్ బండలాగుడు పోటీలను శనివారం మధ్యాహ్నం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో మొదటి బహుమతి రూ.లక్ష, రెండవ, మూడవ, నాల్గవ, 5వ బహుమతులు రూ.70వేలు, రూ.50వేలు, రూ.30వేలు, రూ.10వేలు నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

ట్రేడ్ లైసెన్సులు చెల్లించండి

కమలాపురం : నగర పంచాయతీ పరిధిలోని వ్యాపార సంస్థలకు సంబంధించిన ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ కొరకు పెనాల్టీ లేకుండా ఫిబ్రవరి 28వ తేదీలోపు చెల్లించాలని కమిషనర్ పగడాల జగన్నాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చెల్లించని వారు మార్చి 1వ తేదీ నుంచి 25 శాతం పెనాల్టీతో చెల్లించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. పట్టణంలోని వ్యాపారస్తులందరూ తక్షణం ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని ఆయన తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో అవస్థల్లో విద్యావ్యవస్థ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగనే విద్యావ్యవస్థ పూర్తిగా అవస్థల్లో పడిందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థకు పెద్దపీట వేశారన్నారు. నాడు, నేడు కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా వేల కోట్ల రూపాయాలతో ప్రభుత్వ పాఠశాలలో అన్ని సదుపాయలు కల్పించారన్నారు. నాడు విద్యార్థులకు విద్యాదీవెన, విద్యా వసతి , అమ్మఒడి పథకాలు సకాలంలో అందాయన్నారు. ఫీజు రీయింబర్సుమెంట్ కూడా విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాలో జమ అయిందన్నారు. నేడు కూటమి ప్రభుత్వం హయంలో విద్యార్థుకు అందాల్సిన విద్యా దీవెన, విద్యా వసతీ అందలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఇంత వరకు విద్యార్థులకు ఇవ్వలేదన్నారు. ఎన్నికలలో అమ్మకు వందనం అంటూ ఇంటిలోని ప్రతి పిల్లవాడికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఆ పథకాలు అమలు చేయాలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు రోడ్డున పడే పరిస్థితిని ఈ కూటమి ప్రభుత్వం తెచ్చిందన్నారు. ప్రభుత్వం ఏర్పాడిన తర్వాత ఈ పథకాలు ఇవ్వలేమని, ఆర్థిక పరిస్థితి బాగలేదని చెప్పడం విడ్డురంగా ఉందన్నారు. ఎన్నికలలో ప్రచారం చేసేటప్పుడు అప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గుర్తుకు రాలేదని విమర్శించారు. విద్యా ర్థులు రోడ్డున పడి ఆందోళన బాట పడే దుస్థితి ఉందన్నారు. ఈ కూటమి నాయకులు చెప్పేది ఒక్కటి చేసేది మరోక్కటి అని అన్నారు. ఇప్పటికైన ప్రజలు విద్యార్థులు తెలిసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ, పార్టీ మండల ఇన్‌చార్జి తమ్మిశెట్టి బాలయ్య, పట్టణాధ్యక్షుడు జయరామకృష్ణారెడ్డి, పార్టీ రైతు విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎం.వీరభాస్కర్‌రెడ్డి, పార్టీ వైస్సార్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు దాసరి రమణారెడ్డి పాల్గొన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణరాలు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం, మాగురు, అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు అందిస్తారన్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963 170177 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

మా పొలానికి 'దారి' చూపించండి సారూ..



దస్తావేజులు చూపుతున్న గుజ్జుల సురేష్

కమలాపురం : మా పొలానికి దారి చూపించాలని పలు మార్లు జిల్లా కేంద్రానికి వెళ్లి స్పందనలో అర్జీలు ఇచ్చినా సమస్య పరిష్కారం కావడం లేదని కనీసం పత్రికా ముఖంగా నైనా తమ సమస్యను పరిష్కరించి తమ పొలానికి దారి చూపించాలని మండలంలోని నసంతపురం గ్రామానికి చెందిన గుజ్జుల సురేష్ ఆవేదన వ్యక్తం చేశాడు. గురువారం కమలాపురంలో మీడియా ఎదుట ఆయన తన గోడును వెల్ల బోసుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనది నసంతపురం అని, తన పేరు గుజ్జుల సురేష్ అని, తన తల్లి తండ్రి మరణించారని, తాను కిడ్నీ పేషెంట్ అని, తాను తన అక్క పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసి జీవనం సాగిస్తున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. తన అక్క పార్వతీ దేవికి యల్లారెడ్డి పల్లె పొలాల్లో సర్వే నెంబర్ 739లో 1.79 ఏకరాలు, అలాగే సర్వే నెంబర్ 740-2లో 9 సెంట్లు పొలం ఉందన్నాడు. అలాగే సర్వే నెంబర్ 740 నందు గట్టులో బండ్లదారి ఉందని, ఆ దారిలో నుంచి మా అక్క పొలం లోనికి వెళ్లడానికి సర్వే నెంబర్ 740-2లో 1 సెంటు పట్టా భూమి కూడా కొనుగోలు చేశామన్నారు. ఈ భూమిని మా అక్క పొలం పక్కనే తన భార్య పేరిట పొలం ఉన్న ఓబులేసు అనే హెడ్ కానిస్టేబుల్ ఆక్రమించుకున్నాడని తెలిపాడు. మా అక్క పొలంలోకి వెళ్లడానికి దారి లేదని మా గట్టులో ఉన్న రాతి బండలు ఆయన పగల గొట్టాడన్నారు. దాని వలన తమ 30 సెంట్లు పొలం బీడుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశాడు. మా అక్క పొలంలోకి వెళ్లడానికి తమ వద్ద రిజిస్ట్రేషన్ దస్తావేజులు ఉన్నాయని చెప్పినప్పటికి మమ్ములను పొలం లోనికి వెళ్లనీకుండా బెదిరిస్తున్నాడని సురేష్ తెలిపాడు. అధికారులు స్పందించి తనకు తమ పొలం లోకి వెళ్లడానికి దారి చూపి ఆదుకోవాలని ఆయన కోరుతున్నాడు.

ఘనంగా గంగమ్మ తిరుణాల



సిరిబండి మహోత్సవంలో భక్తులు

పులివెందుల రూరల్ : మండలంలోని తుమ్మలపల్లె సమీపంలో వెలసిన గంగమ్మ చింతలలో అమ్మవారికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని మరుసటి రోజు గురువారం గంగమ్మ చింతలలో సిరిబండి మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సిరిబండికి భాను గొర్రెను కట్టి తుమ్మలపల్లె నుంచి ఊరేగింపుగా గంగమ్మ చింతలకు చేరుకుని అక్కడ అమ్మవారికి జంతుబలులు సమర్పించారు. గంగమ్మ చింతలకు పులివెందుల, తొండూరు మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో కోరిన కోరికలు తీర్చే గంగమ్మ అమ్మవారుగా ఎంతో ప్రసిద్ధి చెందారు. ఆలయ అర్చకులు భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. తిరుణాల సందర్భంగా గంగమ్మ చింతల ఆవరణలో భక్తుల సందడి నెలకొంది.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ చింతల అమ్మవారు

ముద్దనూరులో..

ముద్దనూరు : మండలంలోని బొందలకుంట గ్రామంలో వెలసిన శ్రీగంగమ్మ దేవాలయం వద్ద గురువారం సాయంత్రం గంగమ్మ-పాలేటమ్మ తిరునాల ఘనంగా జరిగింది. ప్రతి ఏటా మహాశివరాత్రి పర్వదినం మరుసటి రోజున నిర్వహించే ఈ గంగమ్మ తిరునాలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. శ్రీగంగమ్మ, పాలేటమ్మ అమ్మవార్లను భక్తులు సందర్శించుకున్నారు.



గంగమ్మ చింతల ఆలయ ఆవరణలో భక్తుల సందడి



ముద్దనూరు : తిరునాలకు హాజరైన ప్రజలు